ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 25.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో పెట్రోల్, గ్యాస్ సిలిండర్లు, యూరియా నిల్వలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాసేపట్లో అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించనున్నారు.
2. రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
3. పేదలకు ఇళ్లు ఇచ్చే అంశంలో ప్రతిపక్షాలు సభను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు.
4. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని కోరుతూ బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు.

-----------------------------

**ముఖ్యమంత్రి సమావేశం**

రాష్ట్రంలో పెట్రోల్, గ్యాస్ సిలిండర్లు, యూరియా నిల్వలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించనున్నారు. ఇంధన సరఫరాలో ప్రజలకు ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూడటంతో పాటు, ముఖ్యంగా రాష్ట్రంలో పెట్రోల్, గ్యాస్ కొరత తలెత్తకుండా ప్రభుత్వం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రస్తుత నిల్వల నిర్వహణపై సీఎం అధికారులతో ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు.

**డెస్క్**

------------------------------

**బండి సంజయ్**

రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న వదంతులు నమ్మవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయిల్ సంస్థల వద్ద సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయనే విషయాన్ని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆయిల్ నిల్వలపై పర్యవేక్షిస్తోందని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ముఖ్యంగా వాహనదారులు రోజువారీ అవసరాలకు తగ్గట్లుగా పెట్రోలు, డీజిల్ ను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

**డెస్క్**

-----------------------------

**పెట్రోల్ బంకుల వద్ద రద్దీ**

ఇంధన సరఫరా నిలిచిపోతుందన్న వదంతులతో హైదరాబాద్ లో నిన్న బంకుల వద్ద వాహనదారులు కిలోమీటర్ల మేర బారులు తీరారు. నగరంలో పలు చోట్ల నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినా, అర్ధరాత్రి వరకు జనం బంకుల వద్దే వేచి చూశారు. వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని అధికారులు చెబుతున్నారు. ఈ ఉదయం నుండి కూడా నగరంలో వాహనదారులు భారీగా పెట్రోల్ బంకులు వద్దకు రావడంతో పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------------------

**హైదరాబాద్**

హైదరాబాద్ లో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వార్తలను జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఖండించారు. జిల్లావ్యాప్తంగా 181 పెట్రోల్ బంకుల్లో సరిపడా నిల్వలు ఉన్నాయని, ఎక్కడా ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి

ఆందోళన చెందవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించారు. ఇదే క్రమంలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------------

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత లేదని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతూ, వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపుకునేందుకు ఒకేసారి పెట్రోల్ బంకులకు వెళ్లడం వల్ల అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, ఎటువంటి వదంతులు వ్యాప్తి చేస్తే లేదా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు చేపడితే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

---------------------------

**తెలంగాణ పెట్రోలియం డీలర్స్**

తెలంగాణలో ఇంధన కొరత ఉందనే వార్తలను తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఖండించింది. అవన్నీ కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది. హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ సంస్థల వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని బంకుల్లో ఇంధనం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని తెలిపింది. కేవలం అనూహ్య రద్దీ వల్ల కొన్నిచోట్ల తాత్కాలిక అంతరాయం ఏర్పడిందే తప్ప, ఎక్కడా ఇంధన కొరత లేదని వివరించింది. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవాస్తవాలను నమ్మవద్దని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

**డెస్క్**

---------------------------

**పౌరసరఫరాల శాఖ**

హైదరాబాద్‌లో పలు పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల రద్దీ నేపథ్యంలో తెలంగాణ పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌కు కొరత లేదని స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనకు గురికావద్దని సూచించారు. రిఫైనరీల నుంచి ఇంధన సరఫరా సక్రమంగా జరుగుతోందని ... ప్రజావసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వదంతుల వల్లే ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద రద్దీ నెలకొందని... తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అధికారులు కోరారు.

**డెస్క్**

---------------------------------

**భట్టి విక్రమార్క**

శాసనసభలో పేదల ఇళ్ల విషయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. పేదలకు ఇళ్ల అంశంలో సభను తప్పుదోవ పట్టించడం సరికాదని భట్టి అన్నారు. నియోజకవర్గానికి 4.5 లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ దాన్ని నెరవేర్చలేదని వ్యతిరేక పక్షాలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. ఒక్క నియోజకవర్గంలోనే 70 నుంచి 80 వేల ఇళ్లు ఉంటాయని అంచనా వేశారని అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలని 22వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని అన్నారు. వారానికోసారి సమీక్షలు నిర్వహిస్తూ ఎన్ని వేల కోట్లైనా ఖర్చు చేయడానికి సిద్ధమని భట్టి విక్రమార్క తెలిపారు. ఏడాదిలో 5 వేల రూపాయలకు పైగా బిల్లులు క్లియర్ చేశామని వివరించారు.

**డెస్క్**

------------------------------

**కరీంనగర్**

తెలంగాణలో క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సాగు విస్తీర్ణం తెలుసుకోవడానికి నిర్వహిస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ క్రింద కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సర్వే చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని భాగ్యలక్ష్మి తెలిపారు. కరీంనగర్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆకాశవాణితో మాట్లాడుతూ

**Byte: Bhagya Laxmi, Dist Agriculture officer**

**పీటీసీ – కరీంనగర్**

-------------------------

**మంత్రి వాకిటి**

తెలంగాణ మట్టిలోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహించామని... ఇది ఒక నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నిన్న హైదరాబాద్ లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం కప్ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**డెస్క్**

-------------------------

**కేటీఆర్**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని కోరుతూ మాజీ మంత్రి, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుని అసెంబ్లీలో కలిశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పవర్‌లూమ్ యూనిట్లపై ఉన్న విద్యుత్ బకాయిలు, సర్‌చార్జీల భారంపై ఆయనకు సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేసి, వాటిని మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో 25 హెచ్.పి. వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల

పరిశ్రమ నిలదొక్కుకుందని, అయితే ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న 'బ్యాక్ బిల్లింగ్' భారం వల్ల వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని కేటీర్ వివరించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

--------------------------------

**నాగర్ కర్నూల్**

నాగర్‌కర్నూల్ పట్టణంలో ప్రజలు ప్రతి ఒక్కరూ ఇంటిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ కోరారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

**బైట్ - సునేంద్రకుమార్ మున్సిపల్ ఛైర్మన్**

**పీటీసీ – నాగర కర్నూల్**

----------------------------------

**నిజామాబాద్**

నిజాబామాద్‌లో యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్.. అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని నిన్న సాయంత్రం నిర్వహించిన సన్నాహక సమావేశంలో భాగంగా అధికారులకు సూచించారు.

**పీటీసీ - కామారెడ్డి/నిజామాబాద్**

---------------------------